క్లుప్తంగా

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



అసరాడలో మొక్క నాటుతున్న వైస్ ఎంపీపీ భాగ్యవతి

ముంచంగిపుట్టు: మండలంలోని వనుగుమ్మ పంచాయతీ అసరాడ గ్రామంలోని అంగన్ వాడీ కేంద్రంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వైస్ ఎంపీపీ భాగ్యవతి మొక్కలు నాటారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అన్నారు. ఇందులో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్లాంటేషన్ ను అభివృద్ధి చేయడం అభినందనీయన్నారు. మొక్కలు నాటడంతో పాటు వాటి పరిరక్షణ బాధ్యత తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ టీచర్ రాధిక, వైఎస్సార్‌సీపీ నాయకుడు దేవా, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.

సీపీఎం మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



సీపీఎం మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ గంగరాజు తదితరులు

అనంతగిరి(అరకులోయటౌన్): అల్లూరి జిల్లాలోని సీపీఎం మహాసభల పోస్టర్‌ను జెడ్పీటీసీ సభ్యుడు దీసరి గంగరాజు సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 4,5వ తేదీల్లో పాడేరులో జరగనున్న మహా సభలకు పార్టీ నాయకులు, అభిమానులు, సానుభూతిపరులు విరివిగా విరాళాలు అందించి విజయవంతం చేయాలని కోరారు. గిరిజన హక్కులు, చట్టాల రక్షణకై పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. భవిష్యత్ పోరాటాల కోసం ప్రజలంతా సహాయ, సహకారాలు అందించాలని కోరారు. నాయకులు మొష్యా, నాగులు, బుద్రయ్య, దేముడు, పూర్ణచంద్, పొట్టన్న తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆధార్ డ్రైవ్

రంపచోడవరం: రంపచోడవరం, చింతూరు డివిజన్‌లోని ఈనెల 19 నుంచి 22వ తేదీ వరకు ఆధార్ నమోదుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు డీఎల్‌పీవో కోటేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత ధ్రువపత్రాలతో వచ్చి ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కోడిపందెంరాయుళ్లు అరెస్టు

రాజవొమ్మంగి: మండల కేంద్రంలోని శివారులో కోడి పందాలు నిర్వహిస్తున్న ప్రాంతంపై దాడి జరిపి ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ నరసింహమూర్తి తెలిపారు. సోమవారం సాయంకాలం జరిగిన ఈ దాడిలో రెండు కోడి పుంజులు, కోడి కత్తులను కూడా స్వాధీన పరచుకున్నట్టు చెప్పారు. కోడి పందాలు నిర్వహిస్తే చర్యలు ఉంటాయని ఎస్‌ఐ నరసింహమూర్తి హెచ్చరించారు.

185 మందికి కంటి పరీక్షలు



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

జి.మాడుగుల: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో 185 మందికి కంటి పరీక్షలు చేశారు. ఇందులో భాగంగా 45 మందికి శస్త్రచికిత్సల అవసర నిమిత్తం విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రికి తరలించారు. జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ విశ్వేశ్వరనాయుడు, పీహెచ్‌సీ వైద్యాధికారి రవిచంద్రశేఖర్, డాక్టర్లు రవికుమార్, డి.వెంకటరావు, వి.కిశోర్‌కుమార్, ఆప్తాలమిక్ అధికారులు ప్రకాష్, సిబ్బంది పైడయ్య, వెంకటరావు, ఆరోగ్య విస్తరణ అధికారి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

సాగునీరు ప్రశ్నార్థకం



నిరుపయోగంగా ఉన్న గుమ్మకోట చెక్‌డ్యాం



వృథాగా పోతున్న సాగునీరు



- గుమ్మకోటలో నిరుపయోగంగా చెక్‌డ్యాం
- వృథాగా సాగునీరు
- ఎండిపోతున్న పొలాలు
- ఆందోళనలో రైతులు
- పట్టించుకోని అధికారులు



మినీ రిజర్వాయర్‌ను కోరుతున్న గుమ్మకోట రైతులు

అనంతగిరి(అరకులోయరూరల్): మండలంలోని నిరుపయోగంగా, శిథిలావస్థకు చేరిన చెక్‌డ్యామ్‌లతో శివారు పంటలకు నీరందక ఎండిపోతున్నాయి. అధికారుల నిర్లక్ష్యం రైతుల పాలిట శాపంగా మారింది. ఆరుగాలం కష్టపడినా పంటలు నష్టపోవడంతో గిరిజన రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏళ్లు గడుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదంటున్నారు. మండలంలో గుమ్మకోట పంచాయతీలో నిరుపయోగంగా మారిన చెక్‌డ్యాంతో సాగునీరు వృథాగా పోతోంది.

అధికారుల నిర్లక్ష్యం

పంచాయతీ కేంద్రానికి కూతవేటు దూరంలో సమీప అడవీ ప్రాంతంలో మినీ రిజర్వాయర్‌కు ఈ ప్రదేశం అనువుగా ఉన్నా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. గతంలో ఓ ప్రైవేట సంస్థ చెక్‌డ్యాం నిర్మించడంతో దిగువున ఉన్న సుమారు 370 ఎకరాలకు సాగునీరు అందేది. ప్రస్తుతం చెక్‌డ్యాం నిరుపయోగంగా మారడంతో పంట కాలువల నిర్వహణ సక్రమంగా లేక పక్కదారుల మీదుగా పోవడంతో సాగునీరు వృథాగా పోతోంది.దీంతో పంటలు ఎండిపోతున్నాయని దిగువు ఉన్న రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎగువన ఉన్న ప్రాంతంలో మినీ రిజర్వాయర్ నిర్మిస్తే **సుమారుగా 15 గ్రామాలకు సంబంధించి అదనంగా మరో 670 ఎకరాలకు సాగునీరు అందే అవకాశముందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం సాగునీరందక పొలాలు బీడుభూములుగా** మారుతున్నాయని చెబుతున్నారు. గుమ్మకోట ఎగువ ప్రాంతంలో మినీ రిజర్వాయర్ నిర్మాణం చేపడితే దిగువ ఉన్న ప్రాంతాలకు మరింత సాగునీరు అందుతోందని రైతులు చెబుతున్నారు. ఈ ప్రాంతం అన్ని రకాల పంటల సాగుకు అనువైనది అయినప్పటికీ ప్రభుత్వం వైఫల్యం కారణంగా బీడు భూములుగా మారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ యంత్రాంగం స్పందించాలని వారు కోరుతున్నారు.

అధికారులు స్పందించాలి



పంచాయతీ పరిధిలో పుష్కలంగా సాగునీటి సౌకర్యం ఉంది. దిగువ పంటలకు సాగునీరందించే కాలువల సైడ్ వాల్ పూర్తి గా శిథిలావస్థకు చేరాయి. దీంతో సాగునీరు వృథాగా పోతోంది. దిగువ పంటలు బీడువారుతున్నాయి. మరమ్మతు చేపడితే పంట భూములకు సాగునీరు అందే అవకాశముంది. అధికారులు స్పందించి మినీ రిజర్వాయర్ నిర్మించాలి.

– **అప్పారావు**, సర్పంచ్ గుమ్మకోట, పంచాయతీ, అనంతగిరి మండలం

సాగునీరు అందించాలి



సాగునీటి సౌకర్యం ఉన్నా సక్రమంగా పంటలకు నీరందడం లేదు. అధికారులు రైతుల కోసం పట్టించుకోవాలి. పాడైన చెక్‌డ్యాంనకు మరమ్మతులు చేయాలి. సాగునీరందించే కాలువల గోడలకు మరమ్మతు చేయాలి. గతంలో పలు మార్లు అధికారులకు ఈ సమస్యపై వినతులు ఇచ్చినా పట్టించుకోలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సమస్య పరిష్కరించాలి.

– **శిరిష**, రైతు, గాలిపాడు, గుమ్మకోట పంచాయతీ, అనంతగిరి మండలం

ప్రతిపాదనలు పంపాం

గుమ్మకోట పంచాయతీ కేంద్రంలో మినీ రిజర్వాయర్ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాం. ఇక్కడ ఎగువ ప్రాంతంలో నుంచి దిగువ పంటలకు సాగునీరందించే కాలువల సైడ్ వాల్స్ మరమ్మతుల కోసం రూ.10లక్షల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తాం.

– **ఎ.వి.వి.కుమార్**, ఎంపీడీవో, అనంతగిరి

భక్తిశ్రద్ధలతో కార్తీక పూజలు



కొయ్యూరులోని మల్లికార్జునస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



సీలేరులో ప్రత్యేకాలంకరణలో శివపార్వతులు

కొయ్యూరు: కార్తీక మాసం మూడోవ సోమవారం **పురస్కరించుకొని శైవక్షేత్రాలు భక్తులతో** కళకళలాడాయి. **శివాలయాల్లోని మహాశివునికి** ప్రత్యేక **పూజలు, అభిషేకాలు చేశారు. ఉదయం** నుంచి **స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు** బారులు **తీరారు. ఇందులో భాగంగా మండల** కేంద్రం**లోని భ్రమరాంభ సమేత మల్లికార్జున స్వామి** ఆలయానికి **భక్తులు పోటెత్తారు. ఆలయాన్ని** ఆనుకుని **ఉన్న ఉత్తరవాహిణిలో భక్తులు పుణ్యస్నా**నాలాచరించారు. **అనంతరం ఆలయానికి వచ్చి పూజలు చేశారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధ**న జరిగింది. **పెదమాకవరంలో వెలసిన బ్రహ్మలిం**గేశ్వర స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు.

సీలేరు: కార్తీక మాసం మూడవ సోమవారం పురస్కరించుకొని భక్తులు సీలేరు నదిలో పుణ్యస్నానాలు ఆచరించి స్థానిక శివాలయంలో భక్తి శ్రద్ధలతో మహా శివునికి ప్రత్యేక పూజలు, దీపారాధన చేశారు. మి వారికి మహాన్యాస రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన, సాయంత్రం ఆకాశదీపాన్ని వెలిగించి, అమ్మవారికి సామూహిక కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. అనంతరంఅన్నసమారాధన నిర్వహించారు.

మన్యంలో ముమ్మరంగా వరి కోతలు



కొండపడా వద్ద వరి కోతలు చేస్తున్న మహిళలు



వరి కుప్పలను మోసుకొని వస్తున్న మహిళలు

ముంచంగిపుట్టు: ముంచంగిపుట్టు మండలంలో 23 పంచాయతీల్లో వరి కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. గ్రామాల్లో ఉన్న గిరిజనులంతా కలిసిమెలిసి వరిపంట కోతల్లో నిమగ్నమైయ్యారు. ఒకవైపు కోతలు చేపడుతూ మరోవైపు వరి పంటను కల్లలకు తరలింపు పనులు చేపడుతున్నారు. 50శాతం మండలంలో వరి కోతలు పూర్తయినట్టు అధికారులు చెబుతున్నారు. నూర్పిళ్ల పనులు సైతం ముమ్మరంగా గిరిజనులు చేస్తున్నారు. ఈ ఏడాది వాతావరణం అనుకూలించడంతో దిగుబడి బాగా వచ్చిందని గిరిజన రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గిట్టుబాటు ధరలు రావచ్చని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

గంజాయి సాగు, రవాణా చట్టరీత్యా నేరం



వెంకటనగరంలో అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ చినబాబు



లంకపల్లిలో యువకులకు వాలీబాల్ కిట్‌ను అందజేస్తున్న సీఐ దుర్గాప్రసాద్

చింతూరు: మండలంలోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన లంకపల్లిలో సోమవారం చింతూరు సీఐ దుర్గాప్రసాద్ కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తు లకు దుప్పట్లు, వాలీబాల్ కిట్లు, పిల్లలకు అల్పాహారం అందజేశారు. అనంతరం సీఐ మాట్లాడుతూ యువత అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని హితవుపలికారు. బాగా చదువుకుని ఉద్యోగాలు సాధించాలని, మావోయిస్టుల ప్రలోబాలకు గురికావద్దని సూచించారు. గంజాయి సాగు, రవాణా చట్టరీత్యా నేరమని వాటికి దూరంగా ఉండాలన్నారు.

రాజవొమ్మంగి: మండంలోని చికిలింత పంచాయతీ వెంకటనగరంలో ఎస్‌ఐ చిన్నబాబు సోమవారం పర్యటించారు. గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత గంజాయి రవాణా, వినియోగం వంటి అసాంఘిక వ్యవహారాలకు దూరంగా ఉండాలన్నారు. ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కల్పించారు. జంతువుల వేటకు విద్యుత్ తీగలు అమర్చడం నిషేధమని, నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. గ్రామంలో ఎవరైనా మద్యం బెల్ట్ షాపులు నిర్వహిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు.

గిరిజన దినోత్సవ క్రీడా పోటీలకు ఎంపిక



క్రీడపోటీల ఎంపిక ప్రారంభిస్తున్న పోతురాజు

రంపచోడవరం: జాతీయ గిరిజన గౌరవ దినోత్సవం సందర్భంగా ఏజెన్సీ 11 మండలాల్లోని ఈఎంఆర్‌ఎస్, గురుకుల, ఆశ్రమ పాఠశాలల్లో 8,9 చదువుతున్న విద్యార్థులకు రంపచోడవరంలో క్రీడ పోటీలను సోమవారం నిర్వహించారు. ఈ పోటీలకు 40 మంది బాలురు, 21 మంది బాలికలు హాజరైయ్యారు. వీరిలో ప్రతిభను బట్టి 26 మందిని ఎంపిక చేశారు. ఎంపిక చేసిన విద్యార్థులకు బుధ, గురు వారాల్లో రంపచోడవరంలోని ఆశ్రమ పాఠశాలలో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్టు స్పోర్ట్స్ కో–ఆర్డినేటర్ , జిల్లా పీడీ, పీఈటీల ప్రధాన కార్యదర్శి కంగల పోతురాజు తెలిపారు. క్రీడల నిర్వహణకు వివిధ పాఠశాలల నుంచి పీడీ, పీఈటీలు పాల్గొన్నారు. విశాఖపట్నంలో ఈ నెల 23 నుంచి 26వ తేదీ వరకు జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభచాటిన ఆయా విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. ఈ నెల 22న రంపచోడవరం నుంచి విశాఖకు ప్రత్యేక బస్సులో బయలుదేరనున్నట్టు చెప్పారు.

నవజాత శిశు కేంద్రంలో మెరుగైన వైద్య సేవలు



కూనవరం ఎస్ఎన్‌సీయూలో శిశువుతో వైద్యులు, సిబ్బంది

కూనవరం: బరువు తక్కువ, అనారోగ్యంతో (హైరిస్క్‌కేసు) ఉన్న శిశువుకు మెరుగైన వైద్యసేవలు అందించి సంపూర్ణ ఆరోగ్యంతో తల్లిదండ్రులకు అప్పగించిన వైద్యులను, సిబ్బందిని పలువురు అభినందిస్తున్నారు. మండల పరిధిలోని కోతులగుట్ట సామాజిక ఆరోగ్య కేంద్రానికి అనుబంధంగా ఉన్న నవజాత శిశుకేంద్రం ఇందుకు వేదికైంది. వివరాలు ఇలా ఉన్నాయి. చింతూరు మండలం లక్కవరం గ్రామానికి చెందిన సిసింద్రి, ధనలక్ష్మి దంపతులకు గత సెప్టెంబర్ 3న మగబిడ్డ పుట్టింది. శిశువు 2.8 కేజీలు బరువుతో పుట్టాడు. ఆ తరువాత ఆరోగ్యం సక్రమంగా లేకపోవడం బరువు తగ్గడం వంటి సమస్యలు ఆ శిశువును వెంటాడాయి. శిశువు జన్మించి 66 రోజులు గడిచినా శిశువు ఆరోగ్యం క్షీణిస్తుండడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందారు. కోతుల గుట్ట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఉన్న నవజాత శిశు కేంద్రంలో ఈనెల 9న శిశువును చేర్పించారు. అప్పుడు శిశువు బరువు 2 కేజీల 30 గ్రాములు, తీవ్ర అనారోగ్యంతో ఉన్నట్టు గుర్తించారు. హెల్త్ సెంటర్ సూపరింటెండెంట్ డాక్టర్ మహేశ్ నేతృత్వంలో నవజాత శిశుకేంద్రం వైద్యురాలు డాక్టర్ ప్రజ్వల, పిడియాట్రీషియన్ డాక్టర్ కార్తికేయ పర్యవేక్షణలో ఎస్ఎన్‌సీయూ సిబ్బంది మెరుగైన వైద్య సేవలు అందించారు. దీంతో శిశువు 3 కేజీల 100 గ్రాములు బరువు పెరిగాడు. అన్ని పరీక్షల అనంతరం, సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నట్టు వైద్యులు ధ్రువీకరించి, సోమవారం శిశువును డిశ్చార్జి చేశారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ పుల్లయ్య ఎప్పటికప్పుడు వివరాలు అడిగి తెలుకోవడం వైద్యులకు పలు సూచనలిచ్చారని, శిశువును సంపూర్ణ ఆరోగ్యంతో డిశ్చార్చి చేసినట్టు వైద్య కేంద్రం సూపరింటెండెంట్ డాక్టర్ మహేశ్ చెప్పారు. ఆస్పత్రిలో శిశువులకు మెరుగైన వైద్యం అందిస్తున్నామన్నారు. గైనకాలజిస్టు డాక్టర్ స్వేత, డాక్టర్ తేజ, ఎస్ఎన్‌సీయు సిబ్బంది కె.ఇందు, సాయమ్మ, దుర్గమ్మ, శ్రీవల్లి, మౌనిక, సత్యపావని, భద్రకాళి తదితరులు వైద్య సేవలందించారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం



అరకులో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ చలపతిరావు



హాజరైన విద్యార్థినులు



డుంబ్రిగుడ గ్రంథాలయంలో మ్యూజికల్ చైర్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు

అరకులోయటౌన్: గ్రంథాలయ వారోత్సవాలు పురస్కరించుకొని మండల కేంద్రంలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో సోమవారం విద్యార్థులకు క్విజ్, జనరల్ నాలెడ్జ్ పోటీలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ పట్టాసి చలపతిరావు ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో స్థానిక క్రీడా పాఠశాల ప్రిన్సిపాల్ మూర్తి ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. ప్రిన్సిపాల్ చలపతిరావు మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకొని విజ్ఞానం పెంపొందించుకోవాలన్నారు. మొబైఫోన్‌ల వినియోగాన్ని పరిమితం చేసి, గ్రంథాలను అపరిమితంగా చదివి, ఉన్నత శిఖరాలు అధిరోహించి, సమాజంలో ఆదర్శంగా నిలిచి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. అధ్యాపకులు బాలరాజు, సుభాష్ విద్యార్థినులు పాల్గొన్నారు.

దుంబ్రిగుడ: గ్రంథాలయ వారోత్సవాల భాగంగా మండల కేంద్రంలోని గ్రంథాలయంలో సోమవారం విద్యార్థినులకు మ్యూజికల్ చైర్ పోటీలను నిర్వహించారు. పోటీల్లో గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాల, కేజీబీవీ పాఠశాల నుంచి సుమారు 120 మంది విద్యార్థినులు పాల్గొన్నారు. చదువుతో పాటు క్రీడల్లో కూడా విద్యార్థులు సత్త చాటాలని గ్రంథాలయ అధికారి సునీత చెప్పారు. ఉపాధ్యాయులు, గ్రంథాలయ ఓఎస్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

హుకుంపేట: గ్రంథాయలయ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు వ్యాసరరణ ,క్విజ్ పోటీలతో పలు ఆటల పోటీలను నిర్వహిస్తున్నట్టు శాఖా గ్రంథాలయాధికారి వి.మానస అన్నారు. స్థానిక గ్రంథాలయంలో సోమవారం విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతలకు గ్రంథాలయ వారోత్సవాల్లో ముగింపు రోజున బహుమతులు అందజేయనున్నట్టు ఆమె తెలిపారు. పలువురు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



లుంగాపుట్టు వద్ద రహదారి వైపు ఒరిగి ఉన్న ఎండిన చెట్టు

ముంచంగిపుట్టు: ముంచంగిపుట్టు నుంచి పెదబయలు వెళ్లే ప్రధాన మార్గంలో లుంగాపుట్టు మలుపు వద్ద భారీ వృక్షం పూర్తిగా ఎండిపోయి మరింత ఒరిగిపోయింది. నిత్యం వాహనాలతో రద్దీగా ఉండే ఈ మార్గంలో ఎండిన వృక్షం ఎప్పుడు కూలిపోతుందోనని వాహనచోదకులు భయపడుతూ ప్రయాణాలు సాగిస్తున్నారు. వృక్షం కూలీ ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించి ఎండిన చెట్టును తొలగించాలని వాహనచోదకులు, స్థానికులు కోరుతున్నారు. గతంలో నిలువుగా ఉండే చెట్టు గత రెండు రోజులుగా చెట్టు ఒరిగిపోవడంతో వాహనచోదకులు మరింత భయపడాల్సిన పరిస్థితి నెలకొంది.

పెరిగిన చలితో సతమతం



అప్పలరాజుపేటలో చలిమంట వద్ద గ్రామస్తులు

రాజవొమ్మంగి: మండలంలో ఉదయం 8 గంటల వరకు మంచు కురుస్తోంది. చలి తీవ్రత పెరుగుతుండడంతో ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలని , స్వెట్టర్లు ధరించి బయటకు రావాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి నాగార్జున సూచించారు. మండల పరిసరాల్లో సోమవారం రాత్రి నుంచి వాతావరణంలో మార్పులు వచ్చి చలి తీవ్రత పెరిగింది. సాయంత్రం నుంచి చల్లటి గాలులు వీచాయి. చలి మంటలు వేసుకొని రక్షణ పొందుతున్నారు.

విద్యార్థినులకు అభినందనలు



ఎం.శ్రావణి



చల్లా కీర్తి



ఉమాలక్ష్మి

చింతపల్లి: వ్యవసాయ కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించే అగ్రిసెట్‌లో చింతపల్లి సేంద్రియ వ్యవసాయ కళాశాల విద్యార్థినులు ర్యాంకులు పొంది అగ్రికల్చర్ బీఎస్సీలో ప్రవేశాలు సాధించినట్టు ఏడీఆర్, వ్యవసాయ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పలస్వామి సోమవారం తెలిపారు.

2024 విద్యాసంవత్సరానికి సంబంధించి చింతపల్లి సేంద్రియ వ్యవసాయ కళాశాలలో డిప్లమో పూర్తి చేసుకున్న విద్యార్థులు అగ్రిసెట్ పరీక్షలు రాయగా వారిలో విజయనగరం జిల్లాకు చెందిన ఎం.శ్రావణి, పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన చల్లా కీర్తి, అల్లూరి జిల్లా చింతపల్లికి చెందిన గెడ్డం ఉమాలక్ష్మిలు ర్యాంకులు సాధించి, బాపట్ల, నైరా కళాశాలల్లో ప్రవేశాలు లభించాయన్నారు. వీరిని ప్రిన్సిపాల్ అప్పలస్వామి, వైస్ ప్రిన్సిపల్ బాలహుస్సేన్‌రెడ్డి, శాస్త్రవేత్తలు బోధనా సిబ్బంది అభినందించారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



విజేతలకు బహుమతి అందజేస్తున్న వికాస్ బాలరాజు

అరకులోయటౌన్: మండలంలోని పద్మాపురంలో నేచర్ క్రియాశీల స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మెగా వాలీబాల్ టోర్నీని సోమవారం నిర్వహించారు. మండల కేంద్రంలోని సీపీహెచ్ పాఠశాలలో జరిగిన పోటీల్లో అరకులోయ, అనంతగిరి, డుంబ్రిగుడ మండలాల నుంచి సుమారు 20 జట్లు పాల్గొన్నాయి. పాఠశాల హెచ్‌ఎం లబుడు బారిక దయానిధి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా నేచర్ క్రియాశీల స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ ఎస్.వికాస్ బాలరాజు మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. గ్రామాల్లో ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలన్నారు. వాలీబాల్ పోటీల్లో అరకులోయ మొదటి స్థానం, అనంతగిరి ద్వితీయ స్థానం, డుంబ్రిగుడ తృతీయ స్థానం దక్కించుకున్నారన్నారు. విజేతలకు నగదు బహుమతి అందజేశారు. మూడు మండలాల నేచర్ సంస్థ కో–ఆర్డినేటర్‌లు సంతోష్‌కుమార్, రవికుమార్, శైలజ, సుమన్, అజయ్, అద్దు, రాంబాబు, సింహాచలం, బంగారు బాబు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.